# జీవ జలము[1]

## యోహాను 7:37-39, పరిశీలన

ఎవరెస్టు శిఖరము ప్రపంచంలో బహు ఉన్నతమైన శిఖరం. హిమాలయ పర్వత శ్రేణిలో, సముద్ర ఉపరితలానికి 29,028[2] అడుగుల ఎత్తులో ఉంది; భూ వాతావరణంలో మూడింట రెండంతల పై గుండా వెళ్లుతుంది. 1920 నుండి, ఆ పర్వత శిఖరాగ్రాన్ని అధిరోహించాలని అనేక ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. ముప్పది సంవత్సారాలకు పైగా తొమ్మిది ప్రయత్నాలు జరిగాయి – తొమ్మిది విఫలమయ్యాయి. 1952లో నేర్పరులైన అధిరోహితులతో స్విస్ జట్టు తయారయింది. వారు అనేక నెలలుగా సిద్ధపడి, జాగరూకతతో ఏర్పాటు చేసికొన్న ప్లానును అనుసరించారు. అయితే చివరకు ఒత్తిడివలనను, అలసటవల్లను వారు ఆ ప్రయత్నాన్ని వదులుకున్నారు.

ఆ తరువాతి సంవత్సరం, డాక్టర్ కర్నల్ జాన్ హంట్ ఆధ్వర్యంలో ఒక బ్రిటీష్ జట్టు నడిచింది. ఆ డాక్టరు స్విస్ ప్రయత్నాన్ని స్టడీ చేసినప్పుడు, ప్రతి రోజు ఒక మనిషికి రెండు కప్పుల నీళ్లు మాత్రమే యిచ్చినట్టు గమనించాడు. మంచును కరిగించే పరికరాలను కొనిపోయే ఏర్పాటును చేశాడు. ఆలాగున పర్వతాన్ని ఎక్కే ప్రతివానికి రోజుకు 12 కప్పుల నీళ్లు యిచ్చేలా ఏర్పాటు చేశాడు. మే 29, 1953లో ప్రపంచంలో కెల్లా అతి ఎత్తయిన పర్వత శిఖరం మీద వారు తమ జెండా నాటేలా ఆ జట్టును అతడు నడిపించాడు.[3] సరిపోయినంత నీటి సరఫరా ఈ విజయానికి దారి తీసింది.[4]

నేడు, నీటి వల్ల కలిగే ప్రయోజనాన్ని నేడు మనం తిరిగి కనుగొన్నాం. నేడు మనం ఎక్కువగా నీరు త్రాగాలని చెప్తున్నారు: రోజుకు కనీసం ఎనిమిదినుండి పది కప్పులు నీళ్లు త్రాగవలసియుంటుంది. మన ఆరోగ్యం దానిమీద ఆధారపడుతుందని వైద్య అధికారులు నియమిస్తున్నారు.

మన దేహానికి భౌతికమైన నీళ్లు ఎలా అవసరమో, మన ఆత్మలకు ఆత్మసంబంధమైన నీళ్లు అలాగే అవసరం. ఇది మన లేఖన భాగంలో నొక్కి చెప్పబడింది:

> ఆ పండుగలో మహాదినమైన అంత్యదినమున యేసు నిలిచి–ఎవడైనను దప్పిగొనిన యెడల నాయొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను. నాయందు విశ్వాసముంచు వాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులోనుండి జీవజల నదులు పారునని బిగ్గరగా చెప్పెను. తనయందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మను గూర్చి ఆయన ఈ మాట చెప్పెను. యేసు ఇంకను మహిమపరచబడలేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహింప బడలేదు (యోహాను 7:37–39).

## సంప్రదాయ ఆచారములకు క్రీస్తు అంతరాయం కలిగించారు

క్రీస్తు మాటలను అభినందించాలంటే, నీకు ఇక్కడ ప్రస్తుతమౌతున్న పండుగను గూర్చి, ఆ సమయంలో జరిగే నీటి ఆచారం గూర్చి కొంత తెలుసుకోవాలి. ఆ పండుగ పర్ణశాలల పండుగ (యోహాను 7:2). ఆ సంవత్సరంలో యూదులు చేసుకునే ఆఖరు పండుగ. నీవుకాని కాలయంత్రాన్ని వెనక్కు తిప్పి పూర్వకాలపు ఇశ్రాయేలీయుల పండుగ ఆచరణను కనుక చూడ గలిగినట్టయితే, ఈ పండుగను చాలా ఎంజాయ్ చేయగలవు.

ఈ పండుగ సెప్టెంబరు చివరిలోగాని అక్టోబరు మొదటిలోగాని వస్తుంది. యూదుల మూడు ప్రధాన పండుగలలో యిది యొకటి,[5] యూదులు లోకంలోని నలుమూలలనుండి యెరూషలేమునకు వచ్చి చేరుకుంటారు. అది కేవలం ఒక దినం కాదు; పండుగ ఏడు దినాలు జరుగుతుంది. ప్రభువు కాలం వచ్చేసరికి ఎనిమిదవ దినం చేర్చబడింది: ఒక దివ్యమైన సబ్బాతు.

ఇతర యూదుల పండుగలవలెనే, ప్రజలకు యిందులో అంచలంచల ప్రాముఖ్యత ఉంటుంది. దీనికి మొదటిగా చారిత్రిక ప్రాధాన్యత ఉంది. వారి పితరులు అరణ్య ప్రయాణాలు చేసిన జ్ఞాపకాలను అది యిస్తుంది (లేవీ. 23:43). పండుగ కాలంలో, యూదులు వెలుపట పర్ణశాలలో – తాత్కాలిక కట్టడాల్లో – తమ చేతులతో నిర్మించుకున్న – చెట్లకొమ్మలు – కర్జూరపు ఆకులతో కట్టుకున్న వాటిలో నివసిస్తారు (లేవీ. 23:40).[6] ఇవి రోడ్లమీదను, యిండ్లపైనను, దేవాలయపు చుట్టుప్రక్కల ప్రాంతాలలోను, యెరూషలేము కొండ చరియలలోను నిర్మించబడతాయి. ఈ వారమంతటిలో–తండ్రులు వారి కుమారులు, తల్లులు వారి కుమార్తెలు – తాత ముత్తవ్వలు – అందరు ఈ పర్ణశాలలో నివసిస్తారు. వారు అక్కడ తింటారు, నిదురిస్తారు, ప్రార్థిస్తారు, ఆ నలువది సంవత్సరాలలో దేవుడు తమ పితరులను ఎలా పోషించి నడిపించాడో దాని గూర్చి చదువుతారు.

గతంలో దేవుని పోషణను గూర్చి చదవడం మాత్రమే గాక, ప్రస్తుతము దేవుని కరుణా హస్తము తమకు తోడుగా ఉండడాన్ని గూర్చి వారు ఉత్సవం జరుపుకుంటారు. దీనికి వ్యవసాయపు ప్రాధాన్యత ఉంటుంది. బార్లి, యవలు, గోధుమ, ద్రాక్షా పండ్లు[7] – సంగ్రహించిన తరువాత – ఇది వచ్చే పండుగ. తమ పంటలకొరకు దేవునికి స్తోత్రము చెల్లించిన తరువాత – రాబోవు సంవత్సరపు పంటలను ఆశీర్వదించునట్లు వారు దేవుని బతిమాలుకుంటారు. భూమి మీదనున్న 70 దేశాల కొరకు 70 ఎడ్లు అర్పించబడతాయి. ఈ ఉత్సవాల్లో 446 మంది యాజకులు అదే సంఖ్యగల లేవీయులు పాల్గొంటారు. దేవాలయపు ఆవరణాల్లో ఇరవై ఒక్క బూరలు ఊదబడతాయి. స్త్రీలు ప్రాంగాణాలలో దివిటీల గుత్తులను వేలాడదీస్తారు. అది దేవాలయపు చుట్టుపట్లను పొరుగు స్థలాలను బహు కాంతివంతం చేస్తాయి.[8] ఆ దివిటీల వెలుగులో పురుషులు రాత్రులందు నాట్యం చేస్తారు. యూదుల పండుగ దినాల్లో యిది బహు ఉత్సాహకరమైన దినమై యుంటుంది![9]

ఇది పండుగకు విశేషమైన నీటి ప్రాధాన్యతను గురించి తెలుపుతుంది. ప్రతి దినపు ఆరంభంలో తెల్లని అంగీలు ధరించిన యాజకులు ఉత్సవంలో పాల్గొనేవారి జాత్రను నడిపిస్తారు. దేవాలయం నుండి క్రిందనున్న సులోయమను కోనేటివరకు యిది

కొనసాగుతుంది. ఆ కోనేరు గీహోను అను నీటి ఊటచే నింపబడుతుంది.[10] పట్టణానికి ప్రాముఖ్యమైన జలాశయం యిదే, త్రాగు నీటికి మూలాధారమదే. వారు ఈ కోనేటి దగ్గరకు వచ్చినప్పుడు, యాజకులలో ఒకడు మెరయుచున్న బంగారు పాత్ర (కుండను) పట్టుకొని, కోనేటిలో ముంచి, దాన్ని నీళ్లతో నింపుతాడు, అతడు ఆలాగు చేసినప్పుడు, "ఆనందపడి రక్షణాధారములైన బావులలోనుండి నీళ్లు చేదుకుందుము" అంటూ జనలు బిగ్గరగా కేకలు వేస్తారు (యెషయా 12:3).

తిరిగి యాజకుడు ఆ ఊరేగింపును (ప్రొసెషన్ను), ఆ కుండను తన తలమీద పెట్టుకొని దేవాలయం కొండమీదికి వస్తాడు. జనులు పక్కను నడుస్తూ, కీర్తనలు 113–118 పాడుతూ, "యెహోవా, దయచేసి నన్ను రక్షించుము; యెహోవా, దయచేసి అభివృద్ధికలిగించుము," "యెహోవా దయాళుడు ఆయన కృప నిరంతరము నిలుచుచున్నది, ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" అంటూ దాన్ని ముగిస్తారు (కీర్తనలు 118:25, 28). లోపలి ప్రాంగణం దక్షణపు పక్కనున్న నీటి గుమ్మానికి వారు చేరువకు రాగా, వారికి మూడు బూర ధ్వనులతో స్వాగతం పలుకుతారు.

దహనబలులు అర్పించు బలిపీఠం ఉండే త్రోవలో యాజకుడు నడుస్తాడు. అతడు కుండను ఎత్తుగా ఎత్తి పట్టుకొనగా కర్జూరపు మట్టలను, చెట్ల సన్నని కొమ్మలను వేలకొలది మంది ఊగించుతూ ఉంటారు. అప్పుడతడు ఆ నీటిని వెండి గరాటాలోనుండి పోస్తూ ఉంటే, అది భూమిలోనికి దిగుతూ ఉంటుంది. ప్రజలు స్తుతులను బిగ్గరగా సలుపుతారు, బూరలు మోగుతుంటాయి.[11]

అరణ్యములోని బండలలోంచి నీళ్ళనిచ్చిన దేవుని ఏర్పాటుకు ఈ ఉత్సవం జరుగుతుంది (నిర్గమ. 17;[12] సంఖ్యా. 20; ద్వితీయో. 8:15; కీర్తనలు 105:41లను చూడు). దేశానికి అత్యవసరమైన నీటివనరుల స్థితిని గూడా అది గుర్తిస్తుంది. ఆ ప్రాంతంలో మే నుండి అక్టోబరువరకు కొంత వర్షం కురుస్తుంది. ఈ పండుగ (అయిపోయిన) తరువాత వెంటనే వర్షాలు కురువకపోతే, తరువాత సంవత్సరం పంటలు ఉండవు. ఈ విధంగా, ఈ ఉత్సవం గతంలో దేవుని కాపుదలకు కృతజ్ఞతలు చెల్లించడమును, భవిషత్తు కొరకైన దేవుని కరుణాహస్తము నిమిత్తము విన్నపం చేయడమునైయుంది. ఈ ధర్మానుసారమైన ఈ కృత్యాన్ని చూసి పిల్లలు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేస్తారు, స్త్రీల హృదయాలు ఆనందంతో నిండుతాయి, ముసలివారిని యువకులుగా ఫీలయ్యేలా చేస్తుంది, అది మనస్సును హత్తుకు పోయే దృశ్యం.

అంతటి విస్తారమైన ఉత్సవము మధ్య, యేసు నిలిచి పెద్దగా మాట్లాడసాగారు (37ఎ వ.). ఆయన నిలబడడమనే వాస్తవం బహు ప్రాధాన్యతను పుంజుకొన్నది. ఆయన బోధించడానికి సాధారణంగా కూర్చుంటారు (యోహాను 8:2 చూడూ). ఆయన బిగ్గరగా మాట్లాడడం గమనార్హం. ఆయన బోధించేటప్పుడు, ఆయా సమయాల్లో ఆయన స్వరము ఎత్తి బోధించెనని చెప్తారు. అన్నిటికంటే ముఖ్యమైనది ఆయన సందేశం: "–ఎవడైనను దప్పిగొనినయెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను నాయందు విశ్వాసముంచువాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులోనుండి జీవజల నదులు పారునని బిగ్గరగా చెప్పెను" (యోహాను 7:37బి, 38).

క్రీస్తు మాటలు అంతరాయమును కలుగజేసాయి – ఉలికి పడేలా చేశాయి, యింతకు ముందెన్నడు జరుగని ఆటంకం కలిగించేవిగా ఉన్నాయి.[13] ఆయన చేసిన సాహసం, కోపము పుట్టించేదిలా ఉంది. బహు కాలంగా గౌరవించబడే ఉత్సవాన్ని[14] గూర్చి, "దానిలో జీవముందని మీరు తలంచుచున్నారా? లేనేలేదు, నా వైపు చూడండి!" అన్నట్టు ఆయన మాటలున్నాయి. ఆచార కర్మలో, కర్మకలాపంలో గాక తనయందే జీవమున్నదని ఆయన జనులకు తెలుపదలచారు.

ఈ సందేశం మొదటి శతాబ్దంలోనే కాదు. ఇరవై యొకటవ శతాబ్దంలోను అవసరమయ్యే ఉంది. ఆరాధన అనేది కర్మ కలాపంకంటే కొంచెం మిన్నయై యుండవచ్చు. ఇందులో బైబిల్లు, కీర్తనల పుస్తకాలు, ప్రభురాత్రిభోజనపు పరికరాలు, కానుకల సమర్పణకు వినియోగించే పాత్రలు[15] ఉంటాయి. మనం ఆరాధనలో జరిగించేదంతా గమ్యం కొరకైన సాధన: అవి సజీవుడగు దేవుని సంధించడం కొరకు ఉపయోగించక పోతే – వినడం, పాడడం, నిలబడడం, కూర్చుండడం, తలలు వంచడం, తలలు పైకెత్తడం వంటి వగైరా పనులన్నియు జరిగించిన తరువాత కూడా, మనం ఆరాధనకు కూడిన స్థలంలోనుండి ఆత్మ సంబంధమైన దాహంతోనే వెడలి పోవచ్చు. ఆరాధన క్రీస్తుద్వారా మనలను దేవుని వద్దకు తెచ్చినప్పుడు మాత్రమే – ఎవరి వద్దనుండి జీవజలములు ప్రవహిస్తాయో, బండయైయున్న ఆ క్రీస్తు యేసు వలన మన దాహం తీరుతుంది (1 కొరింథీ. 10:4).

యోహాను 7:37–39లోని సందేశం మనకందరికి అవసరమే. మొదటిగా యేసు వాగ్దానాలవైపు తేరి చూడు. తరువాత, ఆ వాగ్దానాలు పొందడానికి ఏమి చేయాలని నియమించబడిందో దానిని జరిగించుదాం.

## నదుల పారుటను గూర్చిన క్రీస్తు వాగ్దానాలు

దప్పిగొన్న వారిని తనయొద్దకు రమ్మని క్రీస్తు పిలిచిన మీదట, ఆయన యిలా ప్రకటించారు: "నాయందు విశ్వాసముంచు వాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులోనుండి జీవజల నదులు పారును" (38 వ.). ఆయన మనస్సులో ఏ లేఖనముందో మనకు నిశ్చయముగా తెలియదు. ఆలాటి మాటలతో పాతనిబంధనలో ఏ లేఖనము లేదు. అయితే, ఆలాటి భావన, యెషయా 44:3; 55:1; యెహెజ్కేలు 47:1–11; జెకర్యా 13:1; 14:8 వంటివాటితో చేర్చి అనేక పాతనిబంధన లేఖనాలు వ్యక్త పరచుతున్నాయి. ఈ భాగంలో ప్రత్యేకించి 37, 38 వచనాలు గ్రీకులోను ఇంగ్లీషులోను అంత తేటగాలేవు.[16] "ఎవడైనను దప్పిగొనినయెడల, అతని నా యొద్దకు రానిమ్ము, నాయందు విశ్వాసముంచువాడు త్రాగనిమ్ము. లేఖనం చెప్పినట్టు ఆయన అంతరంగములోనుండి జీవజల నదులు పారును." అయితే ఆత్మను గూర్చి ఆయన ఈ సంగతి చెప్పెను.[17] ఏదియెలాగున్నా, ఈలాటి వివరాలు అంత ప్రాముఖ్యమైనవి కావు. ప్రభువుయొక్క ముఖ్యమైన పాయింటు తేటగానే ఉంది. ఆయన యొద్దకు వచ్చువారు మాత్రమే ఆత్మ సంబంధంగా సేద దీర్చబడతారు.

(1) క్రీస్తు నీటిని, ఆత్మసంబంధమైన నీటిని వాగ్దానం చేశారు. భోజనంలో భౌతికమైన నీటి విలువను మనుష్యులు తిరిగి తెలుసుకుంటున్నారన్న విషయం

ఆరంభంలోనే గుర్తించాం. నీరు భౌతిక సహనము అనే వాటి మధ్యగల సంబంధాన్ని Dr. G. C. పిట్స్ అనే హార్వార్డ్[18] భౌతిక శాస్త్రవేత్త పరిశోధనలు జరిగించాడు. అతడు పురుష క్రీడా కారులను గంటకు 31/2 మైళ్ళు ట్రెడ్ మిల్‌పై[19] నడిపాడు. వాళ్ళు అలసటను పొంది ఇక నడవలేనంతగా వారిని నడిపించాడు. వారిలో ఒక గుంపుకు పరీక్షాకాలంలో నీళ్ళను ఇవ్వలేదు. వాళ్ళు మూడున్నర గంటల కాలం నడిచారు. రెండవ గుంపు క్రీడాకారులకు వారి దేహాలలో ఉన్న నీటి ప్రమాణమెంతో జాగ్రత్తగా పరిశీలించారు. వాళ్ళకు అలసటరాకుండ కాపాడుతూ నీళ్ళను ఇచ్చరు. వాళ్ళకు ప్రతి 15 నిమిషాలకు ఒక కప్పు నీటి మోతాదు ఇచ్చారు. రెండవ పరీక్షలో పాల్గొన్న వాళ్లు అలసిపోనందువల్ల దానిని ఏడు గంటల కాలంలో రద్దు చేసారు. వాళ్ళు డాక్టరు అడిగినంత కాలం పరీక్షకు నిలబడగలమని అన్నారు.

నీరు, భౌతికమైన శ్రమ అనేవాటి మధ్య ఆత్మసంబంధమైన వర్తింపు ఉంది. ఎంతో మంది ఆత్మ పునరుత్థానమనేది లేకుండా అనేక సంవత్సరాలు జీవితం అనే ట్రెడ్ మిల్ పై నడుస్తూ ఉంటారు. వాళ్ళు అంతరంగంలో చాలా అలసి ఉంటారు. ఆత్మసంబంధంగా అలసిపోతారు. తమ జీవితాన్ని సాగించడానికి క్రీస్తు ఆత్మ మూలమైన జీవజలమని వారు గుర్తించాలి.

(2) యేసు జీవజలమును వాగ్దానము చేశారు, "అతని అంతరంగంలోనుండి జీవజల నదులు పారునని" ఆయన తెలిపారు (యోహాను 7:38)[20] గతంలో, సమరయలో బావియొద్ద కలుసుకొన్న స్త్రీతో ఆయన యిలా అన్నారు: "–నీవు దేవుని వరమును – నాకు దాహమునకిమ్మని నిన్ను అడుగుచున్నవాడెవడో అదియు ఎరిగియుంటే నీవు ఆయనను అడుగుదువు, ఆయన నీకు జీవజలమిచ్చును" (యోహాను 4:10). జీవజలము జీవిత సారమైయుంది; అది ఆత్మ తృష్ణను తీర్చునదైయుంది. "నేనిచ్చు నీళ్లు త్రాగువాడెప్పుడును దప్పిగొనదు; నేను వానికిచ్చు నీళ్లు నిత్య జీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను" (యోహాను 4:14). జీవజలము అనేది పరలోక సంతోషము పొందుటకు ముందు రుచియైయుంటుంది (ప్రకటన 7:17; 21:6; 22:1, 17).

(3) యేసు జీవజల నదులను వాగ్దానం చేశారు. ఆ వాగ్దానం వైపు మరోసారి చూడు: "అతని (కడుపు) అంతరంగములోనుండి జీవజల నదులు పారును" (యోహాను 7:38). ఆత్మసంబంధమైనవాని సరఫరాను అది నొక్కి చెప్పుతుంది. సమరయ స్త్రీకి వాగ్దానం చేసిన "బావియంత నీళ్లు" యిప్పుడు "నదులంత నీళ్లు"గా మార్చబడినట్టు ఒకవ్యక్తి గుర్తించాడు.

ఏండెస్ పర్వతాల శిఖరంలో, సముద్ర ఉపరితలానికి 17,000 ఎత్తులో దాదాపు ఒక అడుగు వెడల్పు ఉండి లేనట్టు ఒక చిన్న సెల ఏరు ఆరంభమౌతుంది. నాలుగువేల మైళ్ల తరువాత. ప్రపంచంలోకెల్ల మహా గొప్ప నదియైన అమెజాను నదిలోనికి వచ్చి అది చేరిపోతుంది. అమెజాన్ యొక్క ముఖద్వారము వద్ద సెకండుకు 7.5 మిలియన్ల ఘన అడుగుల చొప్పున అట్లాంటిక్ సముద్రములోనికి నీళ్లు చేరిపోతాయి. ఒకదినం పారే నీళ్లనే మనం పట్టగలిగినట్టయితే, న్యూయార్క్ మహా నగరం యొక్క నీటి అవసరత

తొమ్మిది సంవత్సరాలపాటు తీరుతుంది.[21] ఆ నీరు సముద్రంలోనికి ఎంత బలీయంగా చొచ్చుకు పోతుందంటే, దాని వేగానికి సముద్రంలో 60 మైళ్లవరకు మంచి నీళ్లుగానే అది మిగిలి పోతుంది. అంత చిన్న సెలఏరు ఎంతగొప్ప నదిగా రూపొందిందో ఆలోచించు. అప్పుడు, చిన్నగా ఆరంభమైన క్రైస్తవ్యం మహా నదులంత విస్తారపు దీవెనలతో లోకవ్యాప్తంగా విస్తరించిన సంగతిని గూర్చి యోచించు.[22]

మరలా, "నదులు" అనే పదము క్రీస్తు ప్రభువు సమృద్ధిగా అనుగ్రహించిన దీవెనను విస్తారతను సూచిస్తుంది. "జీవము కలుగుటకును, అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని" ఆయన నిశ్చయంగా చెప్పారు (యోహాను 10:10).

యోహాను ప్రకారము, ప్రభువుచే అనుగ్రహింపబడిన ఒక ప్రత్యేకమైన దీవెన ఆయన మనస్సులో ఉన్నట్టుంది: అది పరిశుద్ధాత్మ అను వరము. "వాని కడుపులో (అంతరంగములో) నుండి జీవజల నదులు పారును" అని ప్రభువు మాటలను యోహాను కోట్ చేసిన తరువాత, అపొస్తలుడు, దానికి దైవ ప్రేరేపితమైన వివరణను యిలా యిస్తున్నాడు: "తనయందు విశ్వాసముంచువారు పొందబోవు **ఆత్మను**[23] గూర్చి ఆయన ఈ మాట చెప్పెను. యేసు ఇంకను మహిమపరచబడలేదు గనుక **ఆత్మ** ఇంకను అనుగ్రహింపబడలేదు" (39 వ.).

క్రీస్తు పరిచర్యలోను, ఆయనతో కూడ ఉన్నవారి పరిచర్యలోను పరిశుద్ధాత్మ చురుకుగా పని చేస్తున్నందున "ఆత్మ ఇంకను అనుగ్రహింపబడలేదు" అనే ప్రయోగానికి వివరణ కావాలి. ఎందుకంటే, క్రీస్తు ఆయనతోకూడ ఉన్నవారి యొక్కయు పరిచర్యలో పరిశుద్ధాత్మ చురుకుగా పని చేస్తున్నాడు (మత్తయి 1:18, 20; 3:16; 4:1; 12:18, 28; లూకా 1:15, 41, 67; 2:25-27; 4:1, 18; 10:21). తన ఆరోహణం తరవాత పరిశుద్ధాత్మను పంపే ఏర్పాటును ప్రభువు సూచిస్తున్నారు (యోహాను 14:26; 15:26; 16:13). దేవుని కుడిపార్శ్వమున ఆయన "మహిమ పరచబడిన" తరువాత ఏర్పాటిది (అపొ. 2:33; రోమా 8:34; ఎఫెసీ. 1:20; కొలస్సీ. 3:1; హెబ్రీ. 1:3, 13; 10:12; 12:2; 1 పేతురు 3:22). ఈ ప్రత్యేకమైన సందర్భం అప్పటికి యింకను భవిష్యత్తులోనే ఉంది.[24]

యోహాను 7:39కి అపొ. 1, 2 బహు శ్రేష్ఠమైన వ్యాఖ్యానం. తన పునరుత్థానం తరువాత యేసు తన అపొస్తలులకు యిలా తెలిపారు: "పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదరు" (అపొ. 1:8ఎ). క్రీస్తు ఆరోహణమైన పది దినాలకు, యూదుల పెంతెకొస్తు పండుగదినాన, ఆ పండ్రెండు మంది "పరిశుద్ధాత్మతో నింప బడ్డారు" (అపొ. 2:1-4). తరువాత పేతురు దీనిని బాప్తిస్మముగా గుర్తించాడు (అపొ. 11:15, 16). ఆ పెంతెకొస్తు దినమున తన శ్రోతలతో పేతురు యిలా అన్నాడు: "-మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొ. 2:38).

అపొస్తలులు పొందిన ఆత్మ వరము అద్భుత వరము; వారి బోధ విని బాప్తిస్మం పొందినవారు పొందింది అద్భుతముకాని వరము. ప్రభువునకు విధేయులైనవారికందరికి

అనుగ్రహింపబడిన వరము (అపొ. 5:32). దేవుని కుమారులు కుమార్తెలకు ప్రసాదింపబడే వరము (గలతీ. 4:6; ఎఫెసీ. 1:13, 14). తన పిల్లలను బలపరచి నిలబెట్టుటకు దేవుని స్వంత ప్రసన్నత అను వరము. రోమా 8లో కొన్ని ప్రత్యేకమైనవి యివ్వబడ్డాయి: శరీర కర్మలను నాశనం చేయడానికి దేవుని ఆత్మ సహాయం చేస్తాడు (13 వ.); ఆయన మన బలహీనతలలో సహాయం చేస్తాడు (26 వ.); ఆయన మన ప్రార్థనలో సహాయం చేస్తాడు (26 వ.).[25] యోహాను 7:38, 39లోని వాగ్దానానికి అపొ. 3:19లోని మాటలు బహుమాన పూర్వకం కావచ్చు; "ప్రభువు సముఖము నుండి విశ్రాంతి కాలము వచ్చునట్లును ..." [26] అనేవి ఆయన మనకు తెస్తాడు.

యోహాను 7:39లోని కీలకమైన పదము "విశ్వసించువారు": "తనయందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మను గూర్చి ఆయన ఈ మాట చెప్పెను." క్రీస్తునందు విశ్వాసముంచు అపొస్తలులు ఆత్మ బాప్తిస్మం పొందుతారు. వారి ఉపదేశానికి ఫలితంగా యేసునందు విశ్వసించువారు "పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొ. 2:36-38). ఏదియెలాగున్నా, ప్రభువును వ్యతిరేకించు వారికి, ఆయనయందు విశ్వాసముంచని వారికి ఈ వాగ్దానంలో పాలులేదు.

## తన కొరకు దప్పిగొన్నవారిలో క్రీస్తు కోరిన విషయములు

యోహాను 7:37-39 [27] లోని వాగ్దానాలను గూర్చి యింకను మాట్లాడు కొనవచ్చు. కాని ఈ వాగ్దానాలను పొందుటకు కావలసిన వాటిని చూద్దాం. మన లేఖన భాగము మూడు అవశ్యకమైన సంగతులను తెలియజేస్తుంది; మనం గుర్తించాలి, అంగీకరించాలి, కార్యం జరిగించాలి.

(1) మన అవసరతను మనం గుర్తించాలి. యేసు తన వర్తమానాన్ని యిలా చెప్పుతూ ఆరంభించారు; "ఎవడైనను దప్పిగొనిన యెడల నాయొద్దకు వచ్చి ..." (యోహాను 7:37). "దప్పిక" అనేది తన శ్రోతలకు లేఖన సంబంధిత పదం. మనలో ఎక్కువ మందికి దప్పిక అంటే ఏమో సరిగా తెలియకపోవచ్చు.[29] అయితే అది వారికి తెలుసు. వారు సంవత్సరపు వర్షపు లేమిగుండా వచ్చారు. ప్రతి సంవత్సరం మే ఆరంభం నుండి వర్షాలు ఆగిపోతాయి. మే, జూన్, జూలై, ఆగష్టు. సెప్టెంబరు, అక్టోబరు ఆరంభం వరకు వర్షాలు కురువలేదు. కాలుతున్న కొండచరియలు యెరూషలేమునకు తూర్పువైపున ఎండిన బీడులుగా[30] కన్పిస్తున్నాయి. కొట్టే వడగాలుల అరేబియా (అరణ్యం) ఎడారినుండి ధూళి మేఘాలను రేపుతూ, శరీరంలోని ప్రతి రంధ్రాన్ని దుమ్ము కణాలతో నింపుతుంది. తన నాలుక అంగిటిని అంటుకొంటుందని కీర్తన లేఖికుడు అనడం ఆ ప్రాంతంలో నివసించేవారికే అర్థమౌతుంది (కీర్తన. 137:6). "గిన్నెడు చన్నీళ్లు త్రాగనిచ్చుట" అనే దాన్ని కోరడం అంటే ఏమో వారికే తెలుసు (మత్తయి 10:42).

ఆత్మ సంబంధమైన, ఉన్నతమైన అవసరతను సూచించడానికి, క్రీస్తు భౌతికమైన అవసరతను ఉపయోగిస్తున్నారు. కొండమీద ప్రసంగంలో, నీతికొరకు ఆకలి దప్పులు

కలిగియుండుటను గూర్చి ఆయన మాట్లాడారు (మత్తయి 5:6)[31] దేవుని కొరకైన తృష్ణ ప్రతి ఆత్మలో నివసిస్తుంది. ప్రజలు, అధికారము, ఆస్తి, అంతస్థు, ఆనందము, పలుకుబడి అనేవాటితో ఈ తపనను అణచి వేస్తారు.[32] ఏదియెలాగున్నా, చివరికి, ఉప్పునీరు దాహాన్ని ఎలా చల్లార్చలేదో అలాగే ఆలాటివి ఆత్మ దాహాన్ని చల్లార్చలేవని తేలిపోతుంది.[33] ప్రభువు మాత్రమే ఆ దాహాన్ని తీర్చగలరు. ఆయన లేకుండ, మనలో మండుతూ, దప్పి తీర్చబడని తృష్ణ రగులుతూ ఉంటుంది అని గుర్తించడం మొదట అవసరం.

(2) ఆ తృష్ణ తీర్చగలవారు క్రీస్తు ఒక్కరే, ఆయన మాత్రమేనని మనం అంగీకరించి తీరాలి. "దప్పిగొన్నాను" అని అనడంతో చాలదు సేదతీర్చడానికి యేసు మూలమైయున్నట్టు కూడా మనం అంగీకరించాలి. "ఎవడైనను దప్పిగొనినయెడల, నాయొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవచ్చును, నాయందు విశ్వాసముంచు వానియందు ... వాని కడుపులోనుండి జీవజల నదులు పారును" (యోహాను 7:37, 38).

38వ వచనంలో, తనయందు విశ్వాసముంచవలసిన అవసరతను నొక్కి చెప్పారు. ఈ సందర్భంలో యూదులు ఆయనను మెస్సీయగా అంగీకరించవలసి యుంది. తరువాత అధ్యాయంలో, ఆయన యిలా అన్నారు: "కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని, నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు" (యోహాను 8:24). "విశ్వాసమువలన మాత్రమే" రక్షణయని దీని అర్థం కాదు (యాకోబు 2:24 చూడు).[34] మన విశ్వాసపు కేంద్రము యేసై యుండాలని అది అంటుంది.

(3) మనం మన పక్షంగా క్రియలు జరిగించాలి. మనం దప్పిగొని యున్నామని ఎరిగినంత మాత్రంననే సరిపోదు; ఆ దాహం తీర్చడానికి క్రీస్తు మాత్రమే చాలినవారు అని గ్రహించినంత మాత్రముననే చాలదు; ప్రభువు ప్రసాదించే దాన్ని అందుకొనడానికి మనం ఏదో చేయవలసి యుంటుంది. "వచ్చి దప్పిదీర్చు కొనవచ్చును" అనే మాటల్లో ఈ విషయం తేటపరచబడుతుంది. క్రీస్తు నొద్దకు రావడమంటే ఆయనను ప్రభువుగా గుర్తించి ఆయన చిత్తం చేయడానికి ఒకడు యిష్టపడినవాడై యుండాలి. త్రాగుట అంటే, ఆయన దీవెనలలో పాల్గొనుట, వాటిని మన వ్యక్తిత్వంలో భాగంగా చేసికొనుటయై యుంది. మనం యేసునందు విశ్వసించి ఆయన చిత్తాన్ని మనం జరిగించినప్పుడు, మనం ఆయనలో భాగమైయుంటాం ఆయన మనలో భాగమైయుంటారు.[35] గలతీయలోని క్రైస్తవులకు పౌలు యిలా వ్రాశాడు: "యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు." (గలతీ. 3:26, 27).

విశాలంగా, చల్లని, పవిత్రమైన, స్పటికమువలె తేటైన నీళ్లు ప్రవహిస్తున్నట్టు నీ మనస్సులో చిత్రించుకో. దానికి కొన్ని అంగుళాల దూరంలోనే దాహంచేత చనిపోయి ఎండిపోయిన మానవుల, జంతువుల ఎముకలు ఆ ప్రవాహపు యిరువైపుల ఉన్నట్టు ఊహించుకో. ఆలాటి ఒక విపత్కరమైన సంఘటనను భౌతిక ప్రపంచంలో గ్రహించడం కష్టతరమౌతుంది. అయితే అట్టిది ఆత్మ సంబంధమైన లోకంలో బహు సాధారణమైనదైయుంటుంది. వేలు, లక్షలకొలదిమంది, ఆత్మ సంబంధమైన నీటిని పోగొట్టుకొనినందున

చచ్చారు. జీవజలములకు మూలమైన యేసు వారి గ్రహింపు మేరలో ఉన్నప్పుడే యిట్టి దుర్ఘటన సంభవించుతుంది. సమస్య ఏమంటే, ఆత్మ సంబంధమైన వారి అవసరతను వారు అలక్ష్యం చేశారు. ఆయనయందు విశ్వాసము నిలుపుటకు వారు నిరాకరించారు. వారి జీవితములను ఆయనవైపు మరల్చుటకు నిరాకరించారు. వారు జలమును త్రాగి నూతనత్వమును కనుగొనుటకు నిరాకరించారు.

## ముగింపు

నీ సంగతి ఏంటి? ఆత్మ సంబంధమైన దాహాన్ని నీవు గుర్తించావా? ఈ రోజు క్రీస్తు నొద్దకు రాకుండ మానకు. నీకు పాపక్షమాపణ కావలెనా? ఆయన యొద్దకు వచ్చి దప్పి తీర్చుకో. నీకు బలము కావలెనా? ఆయన యొద్దకు వచ్చి సేదతీర్చుకో. నిన్ను అర్థం చేసికొని నీ పక్షాన నిలిచే ఒకరు నీకు కావలెనా? ఆయన యొద్దకు వచ్చి త్రాగు. నీ జీవితాన్ని మార్చే శక్తి కావలెనా? ఆయన యొద్దకు వచ్చి తృష్ణ తీర్చుకో. ఆత్మ సంబంధంగా సరిక్రొత్తదనం కావలెనా? ఆయన యొద్దకు వచ్చి త్రాగు. నీ జీవితానికి గురి, దిశ కావలెనా? ఆయన యొద్దకు రా, దప్పి తీర్చుకో.

మనం చదువుతున్న లేఖన భాగాన్ని ఆధారంగా చేసికొని ఒక పిల్లల కథను చెప్పుతున్నాను. దీన్ని గూర్చి ఆలోచించు. ఈ కథ C. S. Lewis' *The Silver Chair,* Bookలో తన Chronicles of Narniaలో కన్పిస్తుంది.[36]

జిల్ అనే చిన్నపిల్ల అడవిలో ఒంటరిగా ఉండిపోయింది. ఆమె నడుస్తూ ఉండగా ఒక సింహం ఎదురయింది. ఆమె సింహాన్ని చూడగానే వెనక్కు తిరిగి పరిగెత్తింది. ఎంతవరకు పరిగెత్తిందంటే అలసటతో దప్పిగొంది ఒక కప్పు నీళ్లుదొరికితే చాలు సింహం వచ్చి తినేసినా ఫరవాలేదనుకుంది, ఆమె ఒక నీళ్ల ప్రవాహాన్ని చేరుకుంది కాని ఆ దారిలో ఆమె స్తంభించి పోయింది. ఆ ప్రవాహన్నానుకునే సింహం కూచుంది "నీకు దప్పికగా ఉంటే నీవు నీళ్లు త్రాగవచ్చునని సింహం జిల్‌తో అంది. ఆమె ఎక్కడుందో అక్కడే ఆగి పోయింది.

> "నీకు దప్పికగా లేదా?" అని సింహం అడిగింది.
> "నేను దప్పికతో చచ్చిపోతున్నాను" అని జిల్ అంది.
> "అయితే త్రాగు" అని సింహం చెప్పింది.
> "నేను వస్తే ఏమి చేయనని నీవు నాకు మాట యిస్తావా?" అని జిల్ అడిగింది.
> "నేను ఏ ప్రమాణము చేయను" అని సింహమంది.
> జిల్ ఎంతగా దప్పిగొందంటే, యోచింపకుండగనే ఒక అడుగు ముందుకు వేసింది.
> "నీవు బాలికలను తింటావా?" అని ఆమె అడిగింది
> "నేను బాలికలను, బాలురను, స్త్రీలను, పురుషులను, రాజులను, చక్రవర్తులను పట్టణాలను, ప్రదేశాలను మ్రింగివేశాను" అని చెప్పింది సింహం. ఇది అతిశయం కొరకో, విచారించుతుందనడానికో, కోపించుతున్నానని అనడానికో అది అలా చెప్పలేదు. అది ఊరకే చెప్పింది.
> "వచ్చి త్రాగ సాహసించలేను" అని జిల్ అంది.
> "అప్పుడు దప్పికతో నీవు చస్తావు" అని సింహమంది.

> మరో అడుగు చేరువకు వస్తూ, “ఓ డియర్, నేను వెనుకకు వెళ్లి మరొక సెలయేరుకొరకు వెదకాలి” అని జిల్ అంది
>
> “మరొక సెలయేరు లేదు” అని సింహమంది.
>
> సింహం మాటలు నమ్మకూడదని ఆ బాలికకు తట్టలేదు దాని భీకర ఆకారం చూచిన ఎవరును అలా చేయలేరు.– ఆమె తటాలున తన మనస్సులో తీర్మానం చేసికొన్నది. ఆమె చేసిన వాటన్నిటిలో అది మూర్ఖమైన పని, అయితే ఆమె నీళ్లయొద్దకు ముందుకు వెళ్లి, మోకాళ్లమీద ఒంగి, చేతులతో నీళ్లు తీసికొని త్రాగుతుంది, అది బహు చల్లని బహుగా సేదదీర్చగల నీళ్లు. ఆలాటి నీళ్లను ఆమె ఎన్నడును చవిచూచియుండలేదు. ఆ నీళ్లు నీవు ఎక్కువగా త్రాగనక్కరలేదు, నీ దాహాముకు వెంటనే అవి తీర్చుతాయి.[37]

జిల్ వలె మనలో అనేకులం జీవితంలో పరుగిడుతున్నాం – మన యౌవన కాలం, మన ఎదిగిన కాలం, మన ముసలి కాలమే కావచ్చు.[38] మనం దూరం వెళ్లుతున్నకొలది అంతగా దప్పిగొన్నవారమై యున్నాం – సింహాన్ని ముఖా ముఖిగా ఎదుర్కొన్నాం – అది యూదా గోత్రపు సింహం (ప్రకటన 5:5). పరుగెత్తడం మానుకోమని ఆ సింహం అంటుంది తనకు వేరుగా మన ఆత్మసంబంధమైన దాహం తీర్చబడే మార్గమే లేదని ఆ సింహం అంటుంది. “నేను వేరొక (ఊటను) సెల ఏరును కనుగొంటానని” అంటావా? వేరే సెలఏరు ఏదీ లేదు. “నేను చచ్చి పోబోతున్నానని” నీవు అనబోతావా? ఆయన యొద్దకు రాకుంటే, నీవు ఆత్మ సంబంధంగా చచ్చిపోయేది ఖాయం. పరుగెత్తడంలో నీవు అలసి యుంటే, దప్పిగొనడంలో అలసి యుంటే, నేడే ఆయన యొద్దకు రమ్ము (మార్కు 16:15, 16; అపొ. 2:36–38; గలతీ. 3:26, 27).[39]

---

సూచనలు

[1]Rusty Peterman ప్రసంగం నుండి ఎక్కువగా ఈ సమాచారం సేకరించబడింది. [2]ఈ దూరము 8,848 మీటర్లకు సమానము. [3]Sir Edmund Hillary ఈ అధిరోహణలో గుర్తింపదగినవాడు (న్యూజిలాండ్ దేశస్థుడు). [4]అనేక పరికరాలు ఉన్నా విజయానికి తగినంత నీళ్లు అవసరం. [5]ద్వితీయో. 16:16లో మూడు పండుగలు పేర్కొన బడ్డాయి. తక్కిన రెండు ప్రధాన పండుగలు పస్కా (పులియని రొట్టెల పండుగ); పెంతెకొస్తు (వారముల పండుగ). “క్రీస్తు జీవితం భాగం1లో” “యూదుల పండుగలు” అనే చార్టు చూడు. [6]బాల్యంలో కుంచెవృక్షాల రూపంలో ఉన్న కట్టడాలను మా దేశంలో చూచాను. [7]ఇందును బట్టి – దీనిని ఫల సంగ్రహముల పండుగ అనికూడా పిలిచేవారు (నిర్గమ. 23:16; 34:22). [8]ఈ పండుగలోని వైదిక కర్మలో ఆ దివిటీల వెలుగు – అరణ్యములో తమ పితరులను నడిపించిన అగ్నిస్తంభాన్ని జ్ఞప్తి చేస్తుంది. [9]పర్ణశాలల పండుగ సమయంలో సొలొమోను దేవాలయము ప్రతిష్ఠించబడింది (1 రాజులు 8:2). ఈ విధంగా ఈ పండుగ కాలంలో ప్రత్యేకమైన శ్రద్ధ దేవాలయానికి యివ్వబడేది. [10]“సిలోయమను కోనేరు” అనే పాఠములో ఈ ఊటను గూర్చియు, కోనేటిని గూర్చియు చూడు.

[11]ఈ పండుగలో జరిగే కార్యకలాపాలను గూర్చి *The Mishnah*-Sukkah 4.1–5.6లో వర్ణిస్తుంది. [12]నిర్గమ. 17 నుండి కథను నీవు రివ్యూ చేయగోరవచ్చు. [13]వారు కూడుతున్న ఆరాధనలో యిలా జరిగిన దాని విషయమై శ్రోతలను అడుగు. [14]ఉత్సవం జరిగేటప్పుడు ప్రభువు ఈ మాటలు మాట్లాడారు. తరువాత చెప్పబడలేదు. అది ఎప్పుడైనా, ఉత్సవం జనుల మనస్సులో సరిక్రొత్తగా ఉండియుండవచ్చు. [15]దేవుడు కోరిన ప్రకారమే ఆరాధన జరగాలి (యోహాను 4:24). దీని విషయమై జాగ్రతగా చూచుకొనండి. [16]ఈ తర్జుమాలో NIV, RSV, NKJV చేర్చబడ్డాయి. [17]39 వచనం “నీళ్లు” – ప్రభువు పంపబోయే పరశుద్ధాత్మను సూచిస్తుంది (యోహాను 15:26 చూడు). [18]Harvard అనేది అమెరికాలో గొప్ప విశ్వవిద్యాలయం. [19]ట్రెడ్‌మిల్ అనేది ఒక యంత్రం – దానికి కదిలే వెడల్పైన బెల్ట్ ఉంటుంది. ఒకడు దాని మీద నడువవచ్చు. [20]దేవుడు ఎల్లవేళలా జీవజలముల ఊటయై యున్నాడు (యిర్మీయా 2:13;17:13).

[21]మనదేశపు మెట్రోల్లో న్యూయార్క్ సిటికంటే ఎక్కువ జనాభా ఉంటుంది. [22]సిలువలోని క్రీస్తు ప్రక్కలోనుండి నీరు రక్తము కారిన సంఘటనను తొలి క్రైస్తవ రచయితలు సూచింప నిష్టపడుతుంటారు (యోహాను 19:34) – చిన్న దారగా కారిన నీరు మహాగొప్ప దీవెన ప్రవాహంగా మారిపోయిందని అంటారు. [23]ఇలా నీరు పోయడమనేది – దేవుడు ఆత్మ పోయబడుతుందనే వాగ్దానానికి ముంగుర్తు అనేవారు. యెరూషలేముకు ప్రయాణము ఆరంభించి దీనిపై ఎక్కువ వర్తమానం కొరకు చూడు. [24]యోహాను ఈ సమాచారాన్ని వ్రాసేటప్పటికి పెంతెకొస్తు దినాన ఆత్మ వచ్చిన సంగతి గతించిపోయినదే. [25]విశ్వాసికి అనుగ్రహింపబడే పరశుద్ధాత్మ కార్యాలను వివరించడం ఈ ప్రసంగం యొక్క ఉద్దేశం కాదు (రోమా. 8:9, 11; 1 కొరింథీ. 3:16; 2 తిమోతి 1:14; యాకోబు 4:5). అవసరమనుకుంటే, నీవు ఈ భాగాన్ని వివరింపవచ్చు. [26]అపొ. 3:19లోని పేతురు ప్రతిపాదన ప్రాథమికంగా అపొ. 2:38లోని అతని ప్రతిపాదన వంటిదేయని ఊహించబడింది. అది వాస్తవమైతే, “పరిశుద్ధాత్మ అను వరము” – “విశ్రాంతి కాలములకు” సమానమైనదై యుంటుంది. [27]“అంతరంగములో నుండి” (కడుపులోనుండి) అనే 38వ వచనంలోని ప్రయోగము మనలోనుండి యితరులకు ప్రవహించే దీవెనగా ఉంటుందని గుప్తంచేయబడింది. ప్రభువు మనస్సులో ఈ ఆలోచన ఆ మాటలు పలికినప్పుడు ఉందో లేదో కాని, ఆ భావన సరియైనదిగానే ఉంది. [28]ప్రభువు వ్యక్తి గతమైన ప్రత్యుత్తరం కొరకు పిలుపునిచ్చారే గాని కలసి జరిపించే ఉత్సవానికి కాదు. [29]శ్రోతలకు పరిచయమైన దానిని చెప్పు. [30]ఇది శ్రోతలకు పరిచయం లేకపోతే మరొక దానిని ఉపయోగించు.

[31]ఆత్మ సంబంధమైన అవసరతను గుర్తించడానికి గాను అనేక లేఖనాలు దప్పిక అనే సాదృశ్యాన్ని ఉపయోగించాయి (కీర్తల. 42:1, 2; ప్రకటన 22:17లను చూడు). [32]నీవు ఉన్న స్థలంలో ఈ ప్రతిపాదన సరిపోయే విధంగా ఉపయోగించు. [33]దప్పికచే అల్లాడి సముద్రపు నీటిని త్రాగినవారి అనుభవమది. ఉప్పునీళ్లు వారి తృష్ణ తీర్చేదానికి బదులు, వారు తృష్ణను అధికంగా చేసిందట. నీ శ్రోతలకు ఈ పోలిక అర్థం కాకపోతే యిర్మీయా 2:13లను ఉపయోగించు. [34]రక్షించే విశ్వాసము విధేయతను కలిగిన విశ్వాసమైయుంది (రోమా 1:5;16:26; గలతీ. 5:6; యాకోబు 2:22). విశ్వాసము, మారుమనస్సు, బాప్తిస్మము అనే వాటితో వ్యక్తపరచబడాలి (మార్కు 16:15, 16; అపొ. 2:38; గలతీ. 3:26, 27). [35]ఆత్మ సంబంధమైన “తినుట” “త్రాగుట”ను గూర్చి “క్రీస్తు జీవితం, 3లో” చూడు. [36]C. S. Lewis, *The Silver Chair* (New York: Harper-Trophy, Harper Collins Publishers, 1981), 18-23. ఈ కథ నీ శ్రోతలకు తగినదో లేదో నీవు నిర్ణయించుకోవాలి. [37]Ibid., 22-23. [38]ఈ జీవిత కాలాలకు కొంత వివరణను చేర్చు. [39]ఈ ఆహ్వానంలో క్రైస్తవేతరులకు, క్రైస్తవులై యుండి ప్రభువుతో తమ సహవాసాన్ని అశ్రద్ధ చేసినవారికి వేరువేరుగా వర్తింపచేయవచ్చు. క్రైస్తవులు తమ మొదటి ప్రేమకు తిరిగి వచ్చేలా నొక్కి చెప్పవచ్చు.